


135 కిలోల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి-శృంగవరపుకోట



పట్టుబడిన గంజాయి, కారుతో పోలీసులు

మండలంలోని ముసిడిపల్లి పంచాయతీ దొర్లపాలెం వద్ద 135 కేజీల గంజాయి పట్టుబడిందని ఎస్ఐ తారకేశ్వరరావు తెలిపారు. ఒడిశా రిజిస్ట్రేషన్ గల కారులో గంజాయి అక్రమంగా రవాణా అవుతుందన్న సమాచారంతో ఎస్ఐ తన సిబ్బందితో వెళ్లారు. నిందితులు దొర్లపాలెం వద్ద కారును వదిలి పరారయ్యారు. కారు డిక్కీ తెరిచిచూస్తే 135 కిలోల గంజాయి లభించిందని ఎస్ఐ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

ఆలయ భూములు హాంఫట్!

- ఆక్రమించి యథేచ్ఛగా నిర్మాణాలు
- ఆక్రమణలపై చర్యలకు గ్రామస్తుల డిమాండ్



ఆక్రమిత స్థలంలో చేపడుతున్న నిర్మాణాలు

ఆలయ భూములు... డి-ఫారం... చెరువుగట్లు... వాగులు.. వంటి భూములపై 'దేగ' కన్ను పడిందంటే కబ్జాకు గురైనట్లే! ఈ ప్రాంతంలో ప్రభుత్వ రెవెన్యూ రికార్డులను సైతం తారుమారు చేసే మేధావులున్నారంటే అతిశయోక్తి కాదు. సాక్షాత్తూ లక్కవరపుకోట మండలంలో రంగరాయపురం (అగ్రహారం)లో రామలింగేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి కేటాయించిన రూ.కోట్లు విలువ చేసే భూమి అన్యాక్రాంతమవుతోంది. ఆక్రమణలపై ఫిర్యాదులు చేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ప్రజాశక్తి - లక్కవరపుకోట

మండలంలోని రంగరాయపురం (అగ్రహారం) పంచాయతీలో రామలింగేశ్వరస్వామి ఆలయాన్ని నిర్మించి, రోజువారి ధూప దీప నైవేద్యాల ఖర్చుల నిమిత్తం ఈశ్వరి (బ్రాహ్మణ) కుటుంబీకులు లక్కవరపుకోట సర్వే నంబర్ 9/5లో 1.19 సెంట్లు, అదే సబ్ డివిజన్‌లో మరో 32 సెంట్లు వ్యవసాయ భూమిని విరాళంగా ఇచ్చారు. వంశపార పర్యంగా వస్తున్న ఆ భూమితో వచ్చిన ఆదాయంతో కొంతకాలం బాగానే సాగింది. కాలక్రమేపీ ఆ ఆలయం దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధీనంలోకి వెళ్ళింది. ప్రస్తుతం ఆ భూమి ఆక్రమణకు గురైందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఆక్రమించిన భూమిలో కొంతమేర గృహ నిర్మాణాలతోపాటు వ్యాపార లావాదేవీల కోసం రెస్టారెంట్ వంటివి నిర్మించుకున్నారు. అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి నూతనంగా గృహ నిర్మాణ పనులు చేపట్టడంతో మళ్లీ ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ఈ మేరకు గ్రామస్తులు ఆగ్రహిస్తున్నారు.

ఆలయ భూమి ఆక్రమణపై తహశీల్దార్ తామరాపల్లి రామకృష్ణను వివరణ కోరగా రామలింగేశ్వరస్వామి ఆలయ భూముల ఆక్రమణల గూర్చి గ్రామస్తులు ఫిర్యాదు చేసిన కాలంలో తాను ఇక్కడ లేనన్నారు. భూ ఆక్రమణలకు సంబంధించి ఫిర్యాదు ఇస్తే సర్వే చేస్తామన్నారు.

ఎకరా 86 సెంట్లు భూమి ఉంది

ఈ విషయాన్ని దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ రమణి వద్ద ఫోన్‌లో ప్రస్తావించగా సర్వే నంబర్ 64/1లో ఎకరా 86 సెంట్లు రామలింగేశ్వరస్వామి ఆలయం పేరిట దేవాదాయ శాఖ ఆధీనంలో ఉందని తెలిపారు. ఆ భూమిని ఎవరైనా ఆక్రమణకు పాల్పడితే ఉన్నతాధికారులకు తెలియజేసి వారిపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలి

రూ.కోట్లు విలువ చేసే రామలింగేశ్వరస్వామి ఆలయ భూముల ఆక్రమణపై సమగ్ర సర్వే చేపట్టాలి. ఆక్రమణలపై 2020 అక్టోబర్ 19న గ్రామస్తులతో కలిసి తహశీల్దార్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. ఉన్నతాధికారులు స్పందించి రామలింగేశ్వరస్వామి ఆలయ భూములను అదే ఆలయానికి చెందేలా చర్యలు తీసుకోవాలి.

– దుల్ల వెంకట మహేష్, రంగరాయపురం



సన్ డే

- 42 డిగ్రీలు ఉష్ణోగ్రత నమోదు
- మరో 4 రోజులు వడగాల్పులు
- బెంబేలెత్తిపోతున్న జనం

ప్రజాశక్తి - జామి


ఎండలు మండిపోతున్నాయి. ఆదివారం భానుడి ప్రతాపంతో ప్రజలు బెంబేలెత్తిపోయారు. 42 డిగ్రీల రికార్డు స్థాయి ఉష్ణోగ్రత నమోదైంది. వ్యవసాయ కూలీలు, కాయకష్టం చేసే ప్రజలు ఎండల తీవ్రతకు అల్లాడిపోతున్న పరిస్థితి నెలకొంది. మరో నాలుగు రోజుల పాటు తీవ్రమైన ఎండలు కాస్తాయని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే జనం బయటకు రావడానికి భయపడుతున్నారు.

జామి మండలంలో ఎండల తీవ్రతకు ఆదివారం జనం బెంబేలెత్తిపోయారు. ఉదయం 11 గంటల నుంచి జనం బయటకు తిరగలేని పరిస్థితి. ఎండలు పెరగడంతో క్వారీ కార్మికులు పనులు చేయలేక ఇంటి ముఖం పడుతున్నారు. ఉపాధి కూలీలు కూడా కిలోమీటర్ల దూరంలో ఉన్న చెరువుల పనులకు వెళ్లలేక సొమ్మసిల్లి పడిపోతున్నారు. ఇళ్ల వద్ద కూడా జనం వడగాల్పులతో అవస్థలు పడుతున్నారు. ఏప్రిల్ నెలలోనే ఎండల తీవ్రత ఇలా ఉంటే మేలో ఎండలు ఎంత భయంకరంగా ఉంటాయో ఊహకే ఆందోళన కలిగిస్తోంది.

ఏది ఆసరా?

- 2 వారాలు గడుస్తున్నా జమకాని డబ్బులు
- ఆసరా సాయం కోసం ఎదురుచూస్తున్న అక్కచెల్లెమ్మలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్



ఆసరా సంబరాల్లో నమూనా చెక్కును అందిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల (ఫైల్)

అర్హతే ప్రామాణికం, అక్కచెల్లెమ్మల ఆనందమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పిన పాలకులు.. బటన్ నొక్కితే నేరుగా అక్కచెల్లెమ్మల బ్యాంకు ఖాతాల్లో నగదు జమవుతుందంటూ చేసిన ప్రకటనలు ఆచరణలో అమలు కావడం లేదు. వైఎస్ఆర్ ఆసరా సంబరాలు ప్రారంభించి రెండు వారాలైనా నేటికీ అక్కచెల్లెమ్మల ఖాతాల్లోకి నగదు జమకాలేదు. ఎక్కడికక్కడ సభలు ఏర్పాటు చేసి, నమూనా చెక్కులిస్తున్నా డబ్బులు మాత్రం ఖాతాల్లోకి చేరడం లేదు. ఆసరా డబ్బుల కోసం అక్కచెల్లెమ్మలు ఎదురుచూస్తున్నారు.

మార్చి 25న జిల్లా స్థాయిలో స్వయం సహాయక సంఘాల సభ్యులకు వైఎస్ఆర్ ఆసరా చెక్కుల పంపిణీని చేపట్టారు. అనంతరం మున్సిపాలిటీ, మండల స్థాయిల్లో ఆసరా సంబరాలు నిర్వహించారు. నగరంలోనైతే ఈ నెల ఒకటో తేదీ నుంచి ఐదో తేదీ వరకు ఆసరా సంబరాలు అట్టహాసంగా నిర్వహించారు. విజయనగరం నియోజకవర్గంలో నగర, మండల పరిధిలోని స్వయం సహాయక సంఘాల సభ్యులతో అట్టహాసంగా సమావేశం పెట్టారు. తొమ్మిదో తేదీ గడిచినా పూర్తి స్థాయిలో డబ్బులు జమ కాలేదు. కేవలం 20 శాతం మాత్రమే పడినట్లు తెలుస్తోంది. నియోజకవర్గంలో 41,526 మంది ఎస్‌హెచ్‌జి సభ్యులకు వైఎస్ఆర్ ఆసరా సాయం రూ.30 కోట్లు మేర రావాల్సి ఉంది. మూడో విడతలో భాగంగా విజయనగరం నగరంలో 3,381 గ్రూపులకు చెందిన 33,113 మంది సభ్యులకు రూ.24.90 కోట్లు, గ్రామీణ ప్రాంతంలోని 794 గ్రూపులకు చెందిన 8,413 మంది స్వయం సహాయక సంఘాల సభ్యులకు రూ.5.15 కోట్లు మంజూరయ్యాయి. మొత్తంగా 4,175 గ్రూపులకు చెందిన 41,526 అక్కచెల్లెమ్మల ఖాతాల్లో రూ.30.05 కోట్లు జమ కావాల్సి ఉంది. అయితే ఇప్పటివరకు రూ.6 కోట్ల వరకు వచ్చినట్లు తెలిసింది.

మహిళలకు పెద్దపీట వేస్తూ రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తద్వారా ఆర్థిక స్వావలంబన కలుగుతుందని చెప్పిన పాలకులు ఆచరణలో అమలు చేయడం లేదనే చర్చ సాగుతోంది. ఆసరా పథకంలో భాగంగా గతంలో ఉన్న బకాయిలను నాలుగు విడతలుగా పూర్తిగా మాఫీ చేయనున్నారు. ఇప్పటికే ఆసరా ద్వారా రెండు దఫాలుగా సాయం అందించారు. ఎన్నికల నేపథ్యంలో మూడో విడత ఆసరా అట్టహాసంగా ప్రారంభించిన ప్రభుత్వం సకాలంలో సభ్యులకు డబ్బులు విడుదల చేయలేదు. దీంతో ఆసరా డబ్బులు ఎప్పుడు జమవుతాయోనని మహిళలు ఎదురు చూస్తున్నారు.

సమాజానికి తరగని ఆస్తి విద్యే

- గడపగడపకు వస్తున్నాం.. దీవించండి
- తొండ్రంగిలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించిన మంత్రి బొత్స

ప్రజాశక్తి-గరివిడి



నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి బొత్స సత్యనారాయణ

బాలల భవిష్యత్తు బాగుంటేనే దేశం బాగుంటుందని, విద్యే తరగని ఆస్తి అని భావించిన ముఖ్యమంత్రి దేశంలో ఎక్కడా లేని విధంగా విద్యా రంగానికి నిధులు కేటాయిస్తున్నారని విద్యా శాఖా మంత్రి బొత్స సత్యనారాయణ పేర్కొన్నారు. అమ్మఒడి, విద్యా కానుక ద్వారా బాలలకు కార్పొరేట్ విద్య అందించడమే కాకుండా, రక్తహీనత లేకుండా చూడాలని మధ్యాహ్న భోజనంలో రాగి జావను కూడా మెనూగా చేర్చారని తెలిపారు. గరివిడి మండలం తొండ్రంగి గ్రామంలో నిర్మించిన గ్రామ సచివాలయం, ఆర్‌బికె, వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్ భవనాలను ఆదివారం మంత్రి బొత్స ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బాలల భవిష్యత్తు కోసం వారి తల్లిదండ్రుల కన్నా ముఖ్యమంత్రి ఎక్కువగా ఆలోచిస్తున్నారని తెలిపారు. మన బడి నాడు-నేడు కింద రూ.14 లక్షలతో తొండ్రంగి జిల్లా పరిషత్ హైస్కూల్ అభివృద్ధి పనులను చేపట్టామని తెలిపారు. గ్రామంలో ప్రభుత్వం వచ్చిన నాలుగేళ్లలో రూ.7.80 కోట్లను పలు సంక్షేమ పథకాల ద్వారా పేదల కోసం ఖర్చు చేశామని తెలిపారు. గతం లో ఇంత పెద్ద మొత్తంలో ఎప్పుడైనా లబ్ధి జరిగిందా? అని ప్రశ్నించారు. గడపగడపకు వస్తున్నామని, ఎవరికి ఏమేమి పథకాలు అందించామో తెలియజేస్తామని, ఇంకా ఎవరైనా మిగిలి ఉంటే తెలపాలని కోరారు.

జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా నాలుగేళ్లలో ఎంతో అభివృద్ధి చేశామన్నారు. ఎంపి బెల్లాన చంద్రశేఖర్ మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారంగా అన్ని సంక్షేమ పథకాలను అమలు చేశామన్నారు. నాలుగేళ్లలో రూ.13 కోట్లతో పంచాయతీ అభివృద్ధి జరిగిందన్నారు. కార్యక్రమంలో డిఆర్‌ఒ గణపతిరావు, ఆర్‌డిఒ అప్పారావు, తహశీల్దార్ తాడ్డి గోవింద్, ఎంపిడిఒ భాస్కరరావు, జెడ్‌పి సిఇఒ అశోక్ కుమార్, డిఎంహెచ్‌ఒ రమణ కుమారి, జిల్లా వ్యవసాయ అధికారి తారక రామారావు, తదితరులు పాల్గొన్నారు.

16తో చెరకు క్రషింగ్ పూర్తి

ఇఐడి ప్యారి చక్కెర పరిశ్రమ అసోసియేట్ ఉపాధ్యక్షులు నాగశేషారెడ్డి

ప్రజాశక్తి-రేగిడి



మాట్లాడుతున్న ఇఐడి ప్యారి చక్కెర పరిశ్రమ అసోసియేట్ ఉపాధ్యక్షులు నాగశేషారెడ్డి

సంకిలి ఇఐడి ప్యారి చక్కెర పరిశ్రమలో ఈ ఏడాది చెరకు క్రషింగ్ ఈ నెల 16తో పూర్తి చేయనున్నట్లు ఆ సంస్థ అసోసియేట్ ఉపాధ్యక్షులు ఎ.నాగ శేషారెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. 2022-2023 ఏడాదికి చెరకు క్రషింగ్ 5.85 లక్షల మెట్రిక్ టన్నులు లక్ష్యం కాగా ఆదివారానికి 4.53 లక్షల మెట్రిక్ టన్నులు పూర్తి చేసినట్లు తెలిపారు. మరో ఏడు రోజుల్లో చెరకు క్రషింగ్ పూర్తి చేస్తామని వెల్లడించారు. ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో చెరకు ఉన్న రైతులు కటింగ్ పర్మిట్ల కోసం సిడిఒ, సిడిఎ, నేరుగా కార్యాలయంలో కలవాలని కోరారు. ఇంతవరకు సహకరించిన రైతులకు కృతజ్ఞతలు తెలిపారు. వచ్చే ఏడాదికి చెరకు క్రషింగ్‌కు యాజమాన్యం సూచించిన రకాలకు సంబంధించి మొక్కలు నాటాలని కోరారు. రైతుల పెట్టుబడి దృష్టిలో ఉంచుకొని భారీ రాయితీలు ప్రకటించామన్నారు. 2022 అక్టోబర్ నుంచి ఈ ఏడాది ఏప్రిల్ నెలాఖరు వరకు మామూలు పద్ధతిలో చెరకు నాటిన రైతులకు ఎకరానికి రూ.7 వేలు, దూరపు చాళ్ల పద్ధతిలో నాటే రైతులకు రూ.8 వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. పూర్తి రాయితీ పొందుటకు ఎకరానికి 29 టన్నుల చెరకు సరఫరా చేయాలన్నారు. ప్రత్యేక రాయితీలో భాగంగా 25 టన్నుల చెరకు సరఫరా చేసిన రైతులకు 2024 జనవరి 16 నుండి ఫిబ్రవరి నెలాఖరు వరకు టన్నుకు అదనంగా రూ.75 చెల్లిస్తామన్నారు. 2024 మార్చిలో చెరకు అందిస్తే రూ.125, ఏప్రిల్ ఒకటి నుంచి క్రషింగ్ పూర్తయ్యే వరకు చెరకు సరఫరా చేసే రైతులకు రూ.175 చొప్పున అదనంగా రాయితీలు ఇస్తామన్నారు. యాజమాన్యం ప్రకటించిన రాయితీలో రూ.2,250.. 45 రోజులలో ఇస్తామన్నారు. మిగిలిన రాయితీ రూ.5,750 చెరకు పంట పూర్తిగా కర్మాగారానికి తరలించిన తరువాత దిగుబడి ప్రాప్తికి బిల్లులు చెల్లిస్తామన్నారు.

సమావేశంలో కేన్ జిఎం రమేష్‌కుమార్‌రెడ్డి, కేన్ సీనియర్ మేనేజర్ కిల్లి అప్పారావు, ఫైనాన్షియర్ ఎన్.సింహాద్రి పాల్గొన్నారు.

రెండు రోజులు నీటి సరఫరా బంద్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

తాటిపూడి గ్రావిటీ పైప్‌లైన్ వద్ద లీకేజీల మరమ్మతుల కారణంగా 9, 10 తేదీల్లో 17 నుంచి 47 డివిజన్ల పరిధిలో నీటి పంపిణీకి అంతరాయం ఏర్పడుతుందని ఇఇ కె.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. 11వ తేదీ నుంచి యథావిధిగా ఆయా డివిజన్లకు నీటి పంపిణీ చేస్తామని చెప్పారు. ఆయా డివిజన్ల ప్రజలు సహకరించాలని కోరారు.

ఒలింపిక్ అసోసియేషన్ ఇసి సభ్యులుగా వేణుగోపాల్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాష్ట్ర ఒలింపిక్ అసోసియేషన్ ఇసి సభ్యులుగా జిల్లా ప్రధాన కార్యదర్శి సి హెచ్.వేణుగోపాలరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. చిత్తూరులో జరిగిన రాష్ట్ర ఒలింపిక్ అసోసియేషన్ జనరల్ బాడీ ఎలక్షన్స్‌లో ఆయన్ను ఎన్నుకున్నట్లు ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు గురాన అయ్యలు తెలిపారు. నూతన కార్యవర్గానికి ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మేయర్ విజయలక్ష్మి

కార్పొరేషన్‌లో 35, 37 డివిజన్లలో సుమారు రూ.25 లక్షలతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ ఇసరపు రేవతిదేవి ఆదివారం ప్రారంభించారు. విటి అగ్రహారంలోని రెడ్డి వీధి, గణేష్ నగర్, బిసి కాలనీ ప్రాంతాల్లో సిసి రహదారులు, కాలువలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయా జోనల్ ఇన్‌ఛార్జులు బొద్దాన అప్పారావు, డాక్టర్ విఎస్ ప్రసాద్, బాల బ్రహ్మారెడ్డి, కుమ్మరిగుంటి శ్రీనివాస్, కార్పొరేటర్లు చందక శ్రీను, ఆర్కే తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ తాత్రాజు కృష్ణ, పార్టీ నాయకులు గోవింద్, రాధా రాణి, వర్రి పద్మ తదితరులు పాల్గొన్నారు.

సూరిబాబుకు ఘన నివాళి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మున్సిపల్ మాజీ చైర్మన్ అవనాపు సూరిబాబు 11వ వర్ధంతి సందర్భంగా ఆదివారం కుటుంబ సభ్యులు, వైసిపి నాయకులు, అభిమానులు, కార్యకర్తలు ఘనంగా నివాళు లర్పించారు. సూరిబాబు తనయుడు, వైసిపి యువజన విభాగం జోనల్ ఇన్‌ఛార్జి అవనాపు విక్రమ్, డిసిఎంఎస్ చైర్‌పర్సన్ డాక్టర్ అవనాపు భావన దంపతుల ఆధ్వర్యంలో వారి నివాసంలో వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా అవనాపు విక్రమ్ మాట్లాడుతూ తన తండ్రి ఆశయాలను ముందుకు తీసుకువెళ్లేందుకు నిరంతరం శ్రమిస్తున్నామని చెప్పారు. వర్ధంతి సందర్భంగా జొన్నగుడ్డి రామాలయానికి 50 వేలు విరాళం అందజేశామన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ ఈ వర్ధంతి కార్యక్రమంలో గో గ్రీన్- సేవ్ ఎర్త్- సేవ్ లైఫ్ నినాదంతో మొక్కలు పంపిణీ చేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు కాళ్ల గౌరీశంకర్, నెల్లిమర్ల వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, బొబ్బిలి మున్సిపల్ కో-ఆప్షన్ మెంబర్ రియాజ్ ఖాన్, రామశింగు ప్రసాద్, దుక్క లక్ష్మి, గుంప అప్పలరాజు, జి.కృష్ణంరాజు, వంకర గురుమూర్తి, ఎర్రంశెట్టి రఘు, ఎర్రంశెట్టి పైడిరాజు, సోము రాజేంద్ర ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



రామాలయానికి విరాళం అందజేస్తున్న అవనాపు విక్రమ్, భావన దంపతులు

మహిళా సాధికారతే లక్ష్యం

- విరివిగా నైపుణ్యాభివృద్ధి శిక్షణ
- మండల సమాఖ్యల్లో కుట్టుమిషన్లు
- డ్వాక్రా సభ్యులతో మహిళా మార్టులు
- పెరటి కోళ్ల పెంపకానికి ప్రోత్సాహం
- 'ప్రజాశక్తి'తో డిఆర్‌డిఎ పీడీ కల్యాణ్ చక్రవర్తి ముఖాముఖి



జిల్లాలో మహిళా సాధికారత, ఉపాధి కల్పనే లక్ష్యంగా పనిచేస్తున్నామని డిఆర్‌డిఎ పీడీ కల్యాణ్ చక్రవర్తి తెలిపారు. ఇందుకోసం అనేక పథకాలు ప్రవేశపెట్టామని చెప్పారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు సద్వినియోగం చేసుకునే విధంగా స్వయం సహాయక సంఘాల సభ్యులను ప్రోత్సహిస్తున్నామని వివరించారు. తద్వారా మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. ఇందుకు మహిళలు కూడా విరివిగా ముందుకు వస్తున్నారని తెలిపారు. ఈ వారం తనను కలిసిన ప్రజాశక్తికి ఆయన ముఖాముఖీ ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ ఇంటర్వ్యూ వివరాలు...

– ప్రజాశక్తి, విజయనగరం ప్రతినిధి

ఏయే రంగాల్లో నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇస్తున్నారు?.

జీవనోపాధి కోసం ఎదురు చూసే యువతీ, యువకులకు మేము అందిస్తున్న నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ముఖ్యంగా హోంహెల్త్ ఎయిడ్, రిటైల్ స్టోర్స్, మొదలుకుని సాఫ్ట్ స్కిల్స్ వరకు రకరకాల శిక్షణలు ఉంటాయి. ఇక్కడ శిక్షణ పూర్తిచేసుకున్న తరువాత ఎక్కడైనా ఉపాధి పొందేందుకు అవకాశం ఉంటుంది.

శిక్షణ తరగతులు ఎక్కడ, ఎవరితో ఇప్పిస్తున్నారు?.

జిల్లాలో పూల్‌బాగ్‌లో చైతన్యభారతి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యాన, కెఎల్‌పురంలో లలితా గిరిజన సమాఖ్య ఆధ్వర్యాన, టిటిడిసి ఆధ్వర్యాన శిక్షణ తరగతులు జరుగుతున్నాయి. బొబ్బిలిలో మిలీనియం సాఫ్ట్‌వేర్ కంపెనీ ఆధ్వర్యాన సాఫ్ట్ స్కిల్స్‌పై శిక్షణ ఇస్తున్నాం. ఎంచుకున్న శిక్షణ బట్టి 40 రోజుల నుంచి 4 నెలల వరకు కాల వ్యవధి ఉంటుంది.

నిధులు ఎలా సమకూరుతాయి?.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నైపుణ్యాభివృద్ధి కోసం నిధులు విడుదల అవుతున్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో ఏయే రంగాల్లో మేన్‌పవర్ డిమాండ్ ఎక్కువగా ఉందో గ్రహించి, వాటికి సంబంధించిన శిక్షణ ఇస్తున్నాం. ఉచిత శిక్షణతోపాటు భోజనం, వసతి సదుపాయం కూడా ఉంటుంది. మొత్తం వ్యవహారంపై డిఆర్‌డిఎ పర్యవేక్షిస్తుంది.

తప్పనిసరిగా ఉపాధి దొరుకుతుందా?.

శిక్షణ ఇస్తున్న సంస్థలు లేదా కంపెనీలే 80 నుంచి 90 శాతం ఉపాధి అవకాశాలను కల్పిస్తాయి. ఇప్పటి వరకు శిక్షణ పొందినవారికి ఈ విధంగానే ప్లేస్‌మెంట్లు వచ్చాయి. అవసరమైతే ఆయా సంస్థలు, పరిశ్రమలు కొన్ని సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకుని అందుకు అనుగుణమైన శిక్షణ కోసం ప్రతిపాదనలు పంపుతున్నాయి.

మండల సమాఖ్యల్లో కుట్టుమిషన్లు ఉన్నాయా?.



ఔను! ఒకప్పుడు డిఆర్‌డిఎ ఆధ్వర్యాన మహిళలకు కుట్టుమిషన్ల శిక్షణ ఇచ్చిన విషయం విదితమే. చాలా కాలం కావడం వల్ల ఆయా మిషన్లు మరమ్మతులకు గురయ్యాయి. వాటన్నింటినీ ఇటీవల బాగుచేసి, ఎలక్ట్రిల్ మోటార్లు అమర్చి, ఆధునిక పద్ధతిలో తీర్చిదిద్దాం. ఇలా తయారు చేసినవన్నీ జిల్లా వ్యాప్తంగా అన్ని మండల సమాఖ్యలకు సర్దుబాటు చేశాం. ఆయా కేంద్రాల్లో టైలరింగ్‌పై శిక్షణ, కంపెనీల నుంచి ఆర్డర్లు తెచ్చుకుని కుట్టడం వంటివి చేయాలనే ఆలోచనలో ఉన్నాం. తద్వారా మహిళలకు స్వయం ఉపాధి కల్పించినట్టవుతుందని భావిస్తున్నాం.

పెరటి కోళ్ల పెంపకానికి ఏ రకమైన సాయం అందిస్తున్నారు?.

మహిళలు ఇళ్ల వద్దే ఉంటూ ఆర్థికంగా ఎదిగేందుకు వీలుగా స్వయం సహాయక సంఘాల వారికి పెరటికోళ్ల పెంపకానికి మావంతు సహకారం అందిస్తున్నాం. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా 2,610 యూనిట్లు అందించాం. ఒక్క కొత్తవలస మండలంలోనే 1,810 యూనిట్లు ఏర్పాటు చేసుకున్నారు. ప్రస్తుతం ఒక్కో యూనిట్ ధర రూ.3,970 ఉంది. ఆసక్తిగల సంఘాలు మండలాల్లోని డిఆర్‌డిఎ ఎపిఎం లేదా ఇతర సిబ్బందిని సంప్రదించవచ్చు. కోరుకున్న జాతి కోళ్లను మేమే అందుబాటులోకి తెస్తాం. దాణా కూడా అందుబాటులోకి తెస్తాం. కోత దశకు వచ్చాక తిరిగి విక్రయించుకునేందుకు మార్కెట్ సదుపాయాన్ని కల్పిస్తాం.

మహిళా మార్ట్ అంటే ఏమిటి? ఎక్కడ ఏర్పాటు చేశారు?.

కొన్ని స్వయం సహాయక సంఘాల సభ్యులతో కలిసి వీటిని ఏర్పాటు చేశాం. ముఖ్యంగా మండలాన్ని యూనిట్‌గా తీసుకుని, దాని పరిధిలో జగనన్న చేయూత, వైఎస్ఆర్ ఆసరా వంటి పథకాలు పొందుతున్న స్వయం సహాయ సంఘాల సభ్యుల నుంచి రూ.350 చొప్పున పోగుచేసి, అలా సమకూరిన నిధితో మహిళా మార్టులు ఏర్పాటు చేశాం. వీటిలో రిలయన్స్, మోర్ వంటి మాల్స్ మాదిరిగా అన్ని వస్తు సామగ్రి అందుబాటులో ఉంటుంది.

సభ్యులకు ఏ విధమైన లాభం ఉంటుంది?.

ఇందుకోసం నగదు చెల్లించిన వారంతా సభ్యులుగా ఉంటారు. వారిలోనే కొంతమంది డైరెక్టర్లు ఉంటారు. రిలయన్స్ వంటి పెద్దపెద్ద మాల్స్‌తో అనుసంధానం చేసుకుని సరుకులు తెచ్చుకుంటారు కాబట్టి సరసమైన ధరలకే సరుకులు అందుబాటులో ఉంటాయి. ఈ విధంగా ఆ ప్రాంతంలోని వినియోగదారులకు ఎంతో కొంత ఊరట. మార్ట్ నిర్వహణలో భాగంగా పూర్తికాలపు ఉద్యోగులు అవసరమౌతారు. ప్యాకింగ్, ట్రాన్స్‌పోర్టు వంటివాటికి కూడా కొంతమంది అవసరం. ఈ విధంగా ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయి. ఇప్పటి వరకు గరివిడి, ఎస్.కోట కేంద్రాల్లో ఒక్కొక్కటి చొప్పున ఏర్పాటు చేశాం. జిల్లా వ్యాప్తంగా మిగిలిన మండలాల్లో కూడా ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం. దీని నిర్వహణ, మార్కెటింగ్ మెలకువలపై కూడా నిర్వాహకులకు శిక్షణ ఇప్పిస్తున్నాం.

58వ సారి రక్తదానం


రక్తదానం చేస్తున్న దుర్గాప్రసాద్

నెల్లిమర్ల : జరజాపుపేట గ్రామానికి చెందిన సాధన యువజన సంఘం అధ్యక్షులు పోలుబోతు దుర్గాప్రసాద్ ఆదివారం 58వసారి రక్తదానం చేశారు. ఆకాంక్ష చిల్డ్రన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పూల్ బాగ్ రోడ్‌లో ఏర్పాటు చేసిన స్వచ్ఛంద రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో వైజాగ్ ఎన్‌టిఆర్ బ్లడ్ బ్యాంక్ రక్తసేకరణ చేపట్టింది. ఈ సందర్భంగా యువత స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని ఆకాంక్ష చిల్డ్రన్ ఫౌండేషన్ ప్రతినిధి వినయ్ కోరారు. ఈ కార్యక్రమంలో సాధన యువజన సంఘం సభ్యులు కనకల గణేష్, సూర్యనారాయణ పాల్గొన్నారు.

'రాజేశ్వరరావు ఆశయాలను సాధిస్తాం'

బొబ్బిలి : భూ పోరాట యోధుడు, తనకున్న యావదాస్తిని పేద ప్రజలకు పంచిన మహనీత సిపిఐ ఉద్యమ నిర్మాత కామ్రేడ్ చండ్ర రాజేశ్వరరావు ఆశయాలను సాధిద్దామని సిపిఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ అన్నారు. పట్టణంలో ఆదివారం రాజేశ్వరరావు 29వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఈ నెల 11న ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా విజయవాడ కేంద్రంగా జరగనున్న నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కోట అప్పన్న, సిపిఐ పట్టణ కార్యదర్శి మునకాల శ్రీనివాస్, నాయకులు పి.కృష్ణ, జోగి నాయుడు పాల్గొన్నారు.

ఘనంగా ఈస్టర్ వేడుకలు


వేడుకల్లో పాల్గొన్న మహిళలు

బొబ్బిలి : పట్టణంలో ఆదివారం ఈస్టర్ వేడుకలు ఘనంగా జరిగాయి. చర్చిల్లో తెల్లవారుజామున నుంచి ఈస్టర్ వేడుకలు నిర్వహించారు. సిబిఎం, ఆర్‌సిఎం, ఇతర చర్చిలలో కొవ్వొత్తులతో ప్రార్థనలు చేశారు. యేసుక్రీస్తు పునర్జన్మ రోజున ఈస్టర్ పండగ నిర్వహించడం ఆనవాయితీ అని పాస్టర్లు, ఫాదర్లు అన్నారు. చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో క్రైస్తవులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న చిన్నారుల కోలాటం

రేగిడి : మండలంలోని సంకిలి గ్రామంలో చిన్నారుల కోలాటం పలువురిని ఆకట్టుకున్నాయి. రాజాం మండలం బొద్దాం గ్రామానికి చెందిన విద్యార్థులు కోలాటం నేర్చుకుని ఆయా గ్రామాల్లో పండగలు, సంబరాలు, తిరునాళ్ల సందర్భాల్లో కోలాటం ప్రదర్శనలిస్తుంటారు. శ్రీరామ ముగింపు సందర్భంగా ఆదివారం సంకిలి గ్రామంలో కోలాట ప్రదర్శన నిర్వహించడంతో పలువురు చూసి అభినందించారు. చిన్నారులకు ప్రోత్సాహకాలు అందించారు.

నేటి నుంచి బొద్దవలస గ్రామదేవత పండగ

దెంకాడ : మండలంలోని బొద్దవలసలో సోమవారం నుంచి దుర్గాదేవి పండగ నిర్వహిస్తున్నట్లు గ్రామ సర్పంచ్ ఎర్ర శ్రీనివాసరావు తెలిపారు. గ్రామ పండగ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఈ పండగ నిర్వహిస్తామన్నారు. ఈ పండగ 12 ఏళ్ల క్రితం జరిగిందని ఇప్పుడు మళ్లీ నిర్వహిస్తున్నామని వెల్లడించారు. మొదటి రోజు సోమవారం తొలేళ్ల ఉత్సవం, మంగళవారం అమ్మవారి ఊరేగింపు, పసుపు కుంకాలు ఇవ్వడం, అదే రోజు సాయంత్రం గ్రామంలో రథాలు తిరగడం జరుగుతుందన్నారు. మూడవరోజు బుధవారం అనుపోత్సవం ఉంటుందన్నారు. ఈ మూడు రోజులు పాటు గ్రామంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

నవోదయ మాక్ టెస్ట్‌కు విశేష స్పందన


విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

కొత్తవలస : స్థానిక విజ్ఞాన్ కోచింగ్ సెంటర్ ఆధ్వర్యంలో ఆది వారం నిర్వహించిన నవోదయ మాక్ టెస్ట్‌కు విశేష స్పందన లభించింది. విజయనగరం, శ్రీకాకుళం, అనకాపల్లి, విశాఖపట్నం జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన 267 మంది నవోదయకు శిక్షణ పొందుతున్న విద్యార్థులు ఈ మాక్ టెస్ట్‌కు హాజరైనట్లు విజ్ఞాన్ కోచింగ్ సెంటర్ నిర్వాహకులు బగాది రమణ, పైడి ప్రసాద్, బగాది కోటేశ్వరరావు తెలిపారు. మాక్ టెస్ట్‌లో అత్యధికంగా 85 మార్కులు సాధించిన కె. కుశాల్ కుమార్ (కొత్తవలస) ప్రథమ స్థానంలో విజేతగా నిలిచారు. జోడుమెరకకు చెందిన జోడు దీపక్ 84 మార్కులతో 2వ స్థానంలోనూ, దత్తి గ్రామానికి చెందిన పి. జోషిత్ 83 మార్కులతో 3వ స్థానంలో నిలిచారు. వీరితో పాటు వరుసగా మొదటి పది స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ప్రధాన పరీక్షలో చక్కని ప్రతిభను కనబరచి ఉత్తీర్ణత సాధించాలని పలువురు ఆకాంక్షించారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉచితంగా గుంజీ కిట్లు పంపిణీ

బాడంగి : మండలంలోని ఎరుకులపాక గ్రామంలో ఆదివారం దీక్ష మహిళ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో 80 మందికి గుంజీ కిట్లును పంపిణీ చేశారు. గ్రామంలో గల కాలువలు, రోడ్లను పరిశుభ్రం చేసి అనంతరం దేవాలయం చుట్టూ ఉన్న చెత్తను వీరు తొలగించారు. గ్రామ పారిశుధ్యంపై ప్రతి ఒక్కరూ తమ వంతుగా శుభ్రంగా ఉంచుకోవాలని దీక్ష మహిళలకు సొసైటీ సెక్రటరీ ఎల్ శాంతి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా స్థానిక ఎంపిటిసి పాలవలస గౌరు, సర్పంచ్ పాలవలస పార్వతి మాట్లాడుతూ దీక్ష మహిళలకు సొసైటీ ఆధ్వర్యంలో పేదలకు తమ వంతు సహకారంగా గుంజీ కిట్లును పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో దీక్ష సిబ్బంది లక్ష్మి, శ్రీరామమూర్తి, ఎరుకులపాక గ్రామస్తులు పాల్గొన్నారు.


నేడు టిడిపి ఆందోళనలు

శృంగవరపుకోట: విద్యుత్ ఛార్జీల పెంపును నిరసిస్తూ సోమవారం విద్యుత్ కేంద్రాల వద్ద నిరసనలు చేపట్టనున్నట్లు మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో విద్యుత్ ఛార్జీల పెంపును నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలకు తెలుగుదేశం పార్టీ పిలుపు నిచ్చిందన్నారు. అందులో భాగంగా సోమవారం నియోజకవర్గంలోని అన్ని 133 కేవీ, 32 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ల వద్ద నిరసనలు చేపడుతున్నామని అన్నారు. కార్యక్రమంలో పార్టీలోని వివిధ హోదాలలో ఉన్న నాయకులు, అనుబంధ విభాగాల నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొనాలని ఆమె కోరారు.

అంబేద్కర్ విగ్రహ నిర్మాణానికి విరాళం

భోగాపురం : భోగాపురం ఎస్‌సి, బిసి కాలనీల్లో నూతన అంబేద్కర్ విగ్రహ నిర్మాణానికి జిల్లా వైఎస్‌ఆర్ పార్టీ కోశాధికారి కందుల రఘుబాబు ఆదివారం తన స్వగృహంలో రూ. 50వేల విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో భోగాపురం మేజర్ పంచాయతీ మాజీ ఉప సర్పంచ్ కొమ్మూరు సుబ్బారావు, నాయకులు పడాల భాను ప్రకాష్ రావు, గ్రామ యువకులు ఉదయబాబు, చింతపల్లి శ్రీనివాసరావు, ఎస్‌సి కాలనీ అంబేద్కర్ యువసేన సభ్యులు పాల్గొన్నారు.

మల్లంపేట సిరిమానోత్సవానికి చెట్టు సేకరణ


చెట్టు వద్ద మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

బొబ్బిలి : మున్సిపాలిటీ పరిధిలో ఉన్న మల్లంపేట కొత్తపోలమ్మతల్లి గ్రామ దేవత పండుగ నేపథ్యంలో సిరిమానోత్సవానికి ఆదివారం చెట్టు కొట్టారు. గ్రామ సమీపంలో ఉన్న చెట్టుకు బుడా ఛైర్మన్ ఇంటి పార్వతి, కౌన్సిలర్ తెంటు పార్వతి, కల్లంపూడి లక్ష్మీ వైసిపి పట్టణ అధ్యక్షులు ఇంటి గోపాలరావు, వైసిపి, టిడిపి నాయకులు తెంటు శివ సత్యంనాయుడు, కల్లంపూడి సత్యనారాయణ, ఉత్సవ కమిటీ సభ్యులు పూజలు చేసి సిరిమాను చెట్టు కొట్టారు. ఊరేగింపుగా గ్రామానికి చెట్టు తరలించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నాటుబళ్లతో సేకరణ.. లారీలతో రవాణా..

●ఆగని ఇసుక అక్రమ రవాణా ● రైతు భరోసా కేంద్రాల వద్దనే డంపింగ్ ●తరువాత రాత్రిపూట తరలింపు ● చోద్యం చూస్తున్న అధికారులు

ప్రజాశక్తి- గుర్ల

మండలంలో చంపావతి నది నుండి ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతుంది. పగటిపూట నదిలో ఇసుకను సేకరించి నాటు బల్లుతో ఒడ్డుకు తెస్తున్నారు. ఇలా తెచ్చిన ఇసుకను కొంతమంది మధ్యవర్తులు నాటు బల్లు వారి దగ్గర చౌకగా ఇసుకను కొనుగోలు చేసి, లారీ యజమానులతో బేరం కుదుర్చు కొని రాత్రిపూట లారీలతో విజయనగరం, విశాఖపట్నంకు రవాణా చేస్తున్నారు. ఇందు కోసం నాటు బళ్ల యజమానులు నుండి ఆయా గ్రామాల పెద్దలు పండగల నిమిత్తం రూ. పది వేల చొప్పున వసూలు చేస్తున్నట్లు తెలిస్తోంది. పెద్దలు మాట కాదని ఎవరైనా ఇసుక రవాణా చేస్తే వారిని దగ్గరుండి అధికారులకు అప్పగిస్తామని హుకుం జారీ చేసినట్లు సమాచారం. గ్రామ పెద్దలు, అధికారులు తమకు అండగా ఉన్నారని ధీమాతో ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతుంది, ఈ వ్యవహారం అంత గుర్ల, కలవచర్ల, కోటగండ్రేడు గ్రామాలు కేంద్రగా నడుస్తున్నాయన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.


కోటగండ్రేడులో రైతు భరోసా కేంద్రం పక్కనే ఉంచిన ఇసుక డంపింగ్

కోటగండ్రేడు, కలవచర్ల రెవెన్యూ పరిధిలో ఇసుక అక్రమ రవాణా జరుగుతుందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. స్థానిక అవసరాలకు, జగనన్న గృహ లబ్ధిదారులకు ఇసుక అందుబాటులో లేదని ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఇసుక సకాలంలో అందక పోవడంతో ఇబ్బందులు పడుతున్నామని మరికొంతమంది జగనన్న గృహ లబ్ధిదారులు అంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి అక్రమ రవాణాకు చెక్ పెట్టాలని స్థానికులు కోరుతున్నారు.

రైతు భరోసా కేంద్రం వద్దనే డంపింగ్

రాత్రి పూట చంపావతి నది నుంచి నాటు బళ్లతో అక్రమంగా ఒడ్డుకు చేర్చిన ఇసుకను అక్రమార్కులు దర్జాగా రైతు భరోసా కేంద్రం సమీపంలో డంపింగ్ చేసుకుంటున్నారు. ముఖ్యంగా కోట గండ్రేడు వద్ద నదిలో ఇసుకను ఆ గ్రామానికి చెందిన ఆర్‌బికె వద్ద డంప్ చేసి రాత్రి పూట లారీలతో తరలిస్తున్నారు. ఇదంతా ఆర్‌బికెకు వస్తున్న అధికారులు చూస్తున్నా పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కాగా కలవచర్ల గ్రామంలో పెద్ద సంఖ్యలో ఇసుక డంపింగ్‌లు ఉన్నప్పటికీ రెవెన్యూ, పోలీసు యంత్రాంగం మామ్మూళ్ల మత్తులో పడి పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు కోరుతున్నారు.


కలవచర్లలో తరలింపునకు సిద్ధంగా ఉంచిన ఇసుక డంపింగ్

సంక్షేమ పథకాలు వైసిపితోనే సాధ్యం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

సంక్షేమ పథకాలు వైసిపితోనే సాధ్యమవుతోందని ఎమ్మెల్యే బడ్డు కొండ అప్పల నాయుడు అన్నారు. ఆదివారం అలుగోలు, జోగిరాజుపేట, బొప్పడాం గ్రామాల్లో 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్ళి ప్రభుత్వం అందిస్తున్న పథకాలు వివరాలు సేకరించి లబ్దిదార్ల అభిప్రాయం అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పేదలను గుర్తించి సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. తకాబట్టి ఈ పథకాలు కొనసాగాలంటే మరోసారి జగన్మోహన్‌రెడ్డిని సిఎంను చేయాలని కోరారు. అనంతరం లబ్దిదార్ల ఇళ్లకు స్టిక్కర్లు అతికించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి అంబళ్ళ సుధారాణి, సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు సలహా మండలి సభ్యులు అంబళ్ళ శ్రీ రాములు నాయుడు, డిసిసిబి వైస్ ఛైర్మన్ చనమళ్ళ వెంకట రమణ, వైస్ ఎంపిపిలు సారికి వైకుంఠం నాయుడు, పతివాడ సత్య నారాయణ, జెడ్‌పిటిసి, గృహ సారధుల మండల కన్వీనర్ గదల సన్యాసి నాయుడు, టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు, నాయకులు డి. గిరి బాబు, మత్స శ్రీను తదితరులు పాల్గొన్నారు.


నెల్లిమర్ల : గృహ సారథులకు కిట్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ

పూసపాటిరేగ : జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా వైసిపి నాయకులు మహంతి జనార్దన్‌రావు ఆధ్వర్యంలో పూసపాటిరేగలో ఆదివారం మూడో రోజు ప్రచారం చేశారు. ఇంటింటికి తిరిగి జగనన్న అందిస్తున్న పథకాలపై ఆరా తీశారు. గత ప్రభుత్వానికి ఈ ప్రభుత్వానికి మధ్య తేడా వివరించారు. ఇళ్లకు జగనన్న స్టిక్కర్లు అతికించారు. ఈ కార్యక్రమంలో వాలంటీర్లు, నాయకులు శ్రీనువాసరావు, బాలరాజు, ధర్మారావు, తౌడు, గృహ సారధులు, రాజు, వాసురాజు కార్యకర్తలు, పాల్గొన్నారు.


డెంకాడ: గ్రామాల్లో ప్రచారం చేస్తున్న ఎంపిపి వాసుదేవరావు, తదితరులు

రామభద్రపురం: జగనన్నే మన భవిష్యత్ అని స్థానిక ఎంపిపి చొక్కాపు లక్ష్మణరావు అన్నారు. ఆదివారం మండల పరిధిలోని ఇట్లామామిడిపల్లి, కొత్తరేగ, పాతరేగ గ్రామాల్లో జగనన్న నువ్వే మా భవిష్యత్ అనే ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్ళి పథకాలను ప్రచారం చేస్తూ లబ్ధిదారుల అభిప్రాయం తెలుసుకున్నారు. ప్రతీ ఇంటికి వారి అనుమతితో స్టిక్కర్లు అతికించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సచివాలయం కన్వీనర్లు, వాలంటీర్లు, గృహ సారధులు, మండల జెసిఎస్ కన్వీనర్ చింతల సింహాచలం నాయుడు, ఇట్లామామిడిపల్లి సర్పంచ్ పైడిరాజు, పాతరేగలో మాజీ మండల పరిషత్ ఉపాధ్యక్షుడు పెద్దింటి క్రిష్ణమూర్తి, ఎంపిటిసి రామినాయుడు, కొత్తపేటలో చొక్కాపు సత్యం, కోట సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

డెంకాడ : ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డితోనే బంగారు భవిష్యత్తు ఉందని ఎంపిపి బంటుపల్లి వెంకట వాసుదేవ రావు తెలిపారు. జగనన్న మా భవిష్యత్తు కార్యక్రమం మండలంలోని పినతాడివాడ, గునుపూరుపేట, ఢి కొల్లాం, చల్లవాని పేట సచివాలయాలు పరిధిలో ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పిన తాడివాడ సర్పంచ్ లంక లక్ష్మణరావు, ఎంపిటిసి విజనగిరి అచ్చంనాయుడు, మాజీ సర్పంచ్ వాళ్ళ వెంకట్రావు, నాయకులు మీసాల లక్ష్మణరావు, గుణుపూరు పేట సర్పంచ్ పైల ముత్యాలరావు, శివకృష్ణ, చొల్లంగిపేట సర్పంచ్ కోరాడ కనకరాజు పలువురి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

వేపాడ : మండలంలోని కుమ్మపల్లి, వావిలపాడు, ఏ.కేజీ.పాలెం, బల్లంకి గ్రామాలలో ఆదివారం జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి దొగ్గ సత్యవంతుడు మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిచే ఏకైక ప్రభుత్వం తమదేనన్నారు. కార్యక్రమంలో ఎంపిపి డి. సత్యవంతుడు, జెసిఎస్ మండల కన్వీనర్ బోజంకి శ్రీను, కుమ్మపల్లి, వావిలపాడు, బల్లంకి, బానాది గ్రామ సర్పంచులు నౌడ అరుణ, బీల రాజేశ్వరి, బల్లంకి వరలక్ష్మి, సర్పంచ్ కర్రి యశోద, వైసిపి నాయకుడు బొడ్డు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

విజయనగరం: జొన్నవలస సర్పంచ్ కంది రమాదేవి ఆధ్వర్యంలో ఆదివారం జగనన్నే మా భవిష్యత్తు కారక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కంది గణపతి, ఉప సర్పంచ్ లెంక అప్పారావు, వార్డ్ మెంబర్లు, కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.


వేపాడ: వావిలపాడులో ప్రచారం చేస్తున్న సర్పంచ్ బీల రాజేశ్వరి

గ్రోయిన్లు గల్లంతు..!

● గండి పడితే గ్రామాలు కొట్టుకుపోయే ప్రమాదం
● నాలుగు పైలెట్ నీటి పథకాలకు ముప్పే
● స్పందించకుంటే భారీ మూల్యం చెల్లించుకోవాల్సిందే

ప్రజాశక్తి - రేగిడి

మండలంలోని సంకిలి వద్ద ఉన్న నాగావళి నదిలో బ్రిటిష్ కాలం నాటి గ్రోయిన్లు వరదలకు కొట్టుకుపోయి, గల్లంతయ్యాయి. ఇక్కడ పురాతనంగా గ్రోయిన్లు ఉండేవి. వరదల సమయంలో నది తీర గ్రామాల్లోకి వరద నీరు భారీ ఎత్తున చేరి నష్టం కలగ కుండా గ్రోయిన్స్ కాపాడేవి. అయితే ప్రస్తుతం గ్రోయిన్స్ లేకపోవడంతో నీటి ఉధృతి పెరిగితే గట్లు కొట్టుకుపోయి భారీ నష్టం వాటిల్లుతుందోనని ఆయా గ్రామాల ప్రజలు బితికి బితికిమంటూ జీవిస్తున్నారు. రేగిడి, సంతకవిటి మండలాల్లోని కొన్ని ప్రాంతాల్లో అప్పుడప్పుడు కురుస్తున్న భారీ వర్షాలకు గ్రామాలు, పంట పొలాలు నీట మునుగుతున్నాయి. వర్షం తుఫానుగా మారి భారీ ఎత్తున వరదలు వస్తే నష్టం వాటిల్లే ప్రమాదాలు ఎక్కువగా ఉంటాయని స్థానికులు చెబుతున్నారు. రేగిడి హెడ్ ఛానల్ నుండి బొడ్డవలస గ్రామం వరకు మూడు కిలోమీటర్ల మేర ఐదు గ్రోయిన్స్‌ను గతంలో బ్రిటిష్ అధికారులు నిర్మించారు. కాలక్రమంలో వరదలకు పూర్తిగా శిధిలమై వరద ఉధృతికి పేర్చిన రాళ్లు కొట్టుకుపోయి, ఇసుక మేటలు వేశాయి. గ్రోయన్స్ ప్రస్తుతం గల్లంతు కావడంతో నాగావళి వరద ఉధృతికి రేగిడి ఛానల్ మలుపు వద్ద నాగావళి నీరు ఒకేసారి రావడంతో వరద గట్లు బలహీనంగా తయారయ్యాయి. బలహీనంగా ఉన్న వరదగట్లు వరదలకు కొట్టుకుపోతే జిరాయతీ భూములు కోతకు గురై పంటలు నష్టంతో పాటుగా భూములు మేటలు వేసే ప్రమాదం ఉందని రైతులు చెబుతున్నారు. వరద గట్లు కూడా చాలా కాలం క్రితం వేసినవి కాబట్టి బలహీనమవడంతో గండి పడే అవకాశం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ గండి కొడితే సంకిలి చాయన్న ఛానల్ పరిధి 16 ఉపకాలువలుతో పాటు 50వేల ఎకరాలలో రేగిడి, సంతకవిటి, జి. సిగడాం తదితర మండలాల్లోని భూములు, గ్రామాలు కొట్టుకుపోయే ప్రమాదం ఉందని నిపుణులు చెబుతున్నారు. పాలకులు, అధికారులు స్పందించి గ్రోయన్లు ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు, రైతులు కోరుతున్నారు.


సంకిలి వద్ద నాగావళిలో శిధిలమైన గ్రోయిన్స్

గ్రోయన్లు నిర్మించాల్సిందే



నాగావళి నదిలో రేగిడి ఛానల్ నుండి బొడ్డవలస వరకు మూడు కిలోమీటర్ల మేర వరద ఉధృతికి గ్రోయన్స్ లేక భూములు కోతకు గురవుతున్నాయి. ఇప్పటికే వరద గట్లు బలహీనంగా ఉన్నాయి. ఇక్కడ గండి పడితే వేలాది ఎకరాలు గ్రామాలు కొట్టుకుపోయే ప్రమాదం ఉంది. అధికారులు స్పందించి గ్రోయన్లు మంజూరు చేసి నిర్మాణాలు చేపట్టాలి.

నారు జనార్దన, రైతు సంఘం నాయకులు, సంకిలి.

గండి పడితే పెను ప్రమాదమే



నాగావళి నదీ తీరాన వరద గట్లు బలహీన కారణంగా గండి పడితే వేలాది సాగు భూములు, గ్రామాలు కొట్టుకుపోయి పెను ప్రమాదం జరిగే అవకాశం ఉంది. శిధిలమైన చోట కొత్త గ్రోయన్స్ ఏర్పాటు చేయాలి. వరద గట్లు కూడా నిర్మాణానికి పాలకులు అధికారులు చర్యలు తీసుకోవాలి.

మజ్జి శ్రీనివాసరావు, మండల విప్, రేగిడి

ప్రతిపాదనలు పంపిస్తాం

సంకిలిలో నాగావళి నది వద్ద గ్రోయన్లు పూర్తిగా శిధిలమైన మాట వాస్తవమే. అప్పటి సర్పంచ్, ఎంపిటిసిలు దరఖాస్తులు అందించారు. నిర్మాణాలకు కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపిస్తాం. అవసరమైన మేరకు నిర్మాణాలు చేపట్టేలా చర్యలు తీసుకుంటాం. రైతుల నుండి కూడా వినతలు అందాయి. శిధిలమైన వాటిచోట కొత్త వాటి నిర్మించాల్సి ఉంది. నిధులు మంజూరైన వెంటనే పనులు చేపడతాం.

నర్మద పట్నాయక్, డిఇ , మడ్డువలస.

పొలానికి వెళ్లే రహదారి బాగు చేయరూ..

ప్రజాశక్తి - వంగర

మండలంలోని ఓని అగ్రహారం వెలమ కర్ర పొలానికి, గాయి పొలం (ఎగువ పొలం దిగువ పొలం)నకు వెళ్లే రహదారి (గోర్జ)ను బాగు చేయాలని పలువురు రైతులు కోరుతున్నారు. గ్రామానికి చెందిన 50 మంది రైతులకు చెందిన సుమారు 150 ఎకరాల పొలాలు ఇటువైపు ఉన్నాయి. అయితే అటు వైపు వెళ్లేందుకు పూర్వం నుండి గోర్జ ఉంది. ప్రస్తుతం అది పూర్తిగా ముళ్ళ పొదలు, పిచ్చి మొక్కలతో నిండిపోవడం వల్ల పొలాలకు వెళ్లేందుకు వీలు లేకుండా పోయింది. వెలమ కర్ర పొలం దగ్గర కల్వర్టు లేకపోవడం తో ఆ ప్రాంతంలో ఎగువ వైపు నుంచి వచ్చే నీరంతా కూడా ఆ ప్రాంతంలో నిల్వ ఉండి గోతులు మయంగా తయారయింది. దాని వల్ల పొలాలకు నాటు బళ్ళు వెళ్లే పరిస్థితి లేదు కదా కనీసం తమ పంటను కూడా పొలం నుంచి బయటకు తెచ్చుకునేందుకు రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. సుమారు 30 మీటర్ల పొడవున ఉన్న ఈ రోడ్డు కనీసం ఉపాధి హామీ పని నుంచైనా బాగు చేయాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా ఎవరూ పట్టించుకోవటం లేదని ఆ ప్రాంత రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు బాగు చేసి, కల్వర్టు నిర్మించాలని రైతులు కోరుతున్నారు.

ఓని అగ్రహారం రైతుల వేడుకోలు


తుప్పలతో ఉన్న రహదారి

జగనన్న గృహ ప్రవేశాలు జరిగేనా?

ప్రజాశక్తి - వేపాడ

మండలంలో బక్కునాయుడుపేట వద్ద జగనన్న నిర్మాణాలు నత్తనడకన సాగుతున్నాయి. వేపాడ గ్రామానికి చెందిన సుమారు 48 మంది లబ్ధిదారులకు ఇక్కడ స్థలాలు ఇచ్చారు. ఇందులో కేవలం ఆరుగురు స్లాబ్ స్థాయిలో నిర్మాణాలు చేపట్టారు. మరి కొంత మంది పునాదులు, గోడల స్థాయిలో నిర్మాణాలు చేపట్టి వదిలేశారు. ఇంకొంతమంది పునాదులే తీయలేదు. వారికి కేటాయించిన స్థలాలు ఊరికి దూరంగా ఉండటంతో పాటు పనులు చేపట్టేందుకు సరైన సౌకర్యాలు లేకపోవడం, నిర్మాణ సామగ్రి ధరలు పెరగడం వంటి కారణాలతో నిర్మాణాల్లో జాప్యం జరుగుతుందని లబ్ధిదారులు చెబుతున్నారు. ఈ విషయంపై గృహ నిర్మాణ సంస్థ ఎఇని వివరణ కోరగా నీటి కొరత వాస్తవమేని ఈ పరిస్థితిని అధికారులు దృష్టికి తీసుకుని వెళ్లడం జరిగిందని చెప్పారు.


పునాదుల స్థాయిలో నిలిచిపోయిన నిర్మాణం

అభివృద్ధిలో వెనక్కి..

శృంగవరపుకోట : వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం పాలనలో రాష్ట్రం 20 ఏళ్ల వెనకబడిందని టిడిపి యువ నాయకుడు గొంప కృష్ణ ఆరోపించారు. ఆలుగుబిల్లిలో ఆదివారం ఇదేమి కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వహించారు. నియోజకవర్గ పార్లమెంటు ఉపాధ్యక్షుడు రాయవరపు చంద్ర శేఖర్ ఆధ్వర్యంలోని నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పదంలో నడాలంటే మళ్లీ చంద్రబాబు నాయుడు అధికారంలోకి రావాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత మండల అధ్యక్షుడు జుత్తాడ రామసత్యం, మాజీ వార్డ్ మెంబర్ మంగరాజు, అప్పలపల్లి సర్పంచ్ ఆడారి మహేష్, నాయకులు లగుడు వెంకట్రావు, వినాయక పల్లి గ్రామ సర్పంచ్ గనివాడ సన్యాసినాయుడు, వెలుచూరి శ్రీనివాసరావు, కిలపర్తి హరి తదితరులు పాల్గొన్నారు.

కణపాకలో మెగా వైద్య శిబిరం

విజయనగరం టౌన్ : శ్రీసాయికృష్ణా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక కణపాకలో మహంతవీధి శివాలయంలో ఆదివారం మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటుచేశారు. ఈ శిబిరంలో పిజి స్టార్ హాస్పిటల్ వైద్యులు చాందిన వైద్య పరీక్షలు చేసి, మందులు అందజేశారు. శిబిరాన్ని 42వ డివిజన్ కార్పొరేటర్ పిన్నింటి కళావతి, డిస్ట్రిక్ట్ 102 గవర్నర్ కర్రోతు సత్యం ప్రారంభించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు చెల్లూరి శ్రీనివాసరావు, వాకర్స్ ఇంటర్నేషనల్ డిప్యూటీ గవర్నర్ ఈపు విజయ్‌కుమార్, పి.సూర్యనారాయణ, ఎ.తిరుపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి

శృంగవరపుకోట: మండలంలోని ధర్మవరం సమీపంలోని ప్లే వుడ్ కంపెనీ వద్ద క్వారీ లారీ ఢీకొని పోతనపల్లి గ్రామానికి చెందిన బంగారయ్య (69) ఆదివారం రాత్రి మరణించాడు. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం బంగారయ్య మండలంలోని మామిడిపల్లి గ్రామంలో ఉంటున్న తన మనవరాలు వద్దకు వచ్చి గ్రామదేవత బండ్లమ్మ తల్లికి పసుపు కుంకాలు సమర్పించి సాయంత్రం మామిడిపల్లి నుంచి పోతనపల్లికి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ఎస్ కోట వైపు నుండి వస్తున్న క్వారీ లారీ బంగారయ్య ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో అతను అక్కడకక్కడే మృతి చెందాడు. కాగా ఇటీవల కాలంలో క్వారీ లారీలు మృత్యు పాసాలుగా మారుతున్నాయని అధిక లోడులతో మితిమీరిన వేగంతో వెళ్తూ ప్రమాదాలకు కారణం అవుతున్నాయని ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

కల్యాణ్‌రామ్‌ను కలిసిన నాయకులు

ప్రజాశక్తి - గుర్ల

సినీ హీరో నందమూరి కల్యాణ్ రామ్‌ను చీపురుపల్లి ఎన్‌టిఆర్ ఫ్యాన్స్ విశాఖపట్నం మేఘాలయ హోటల్లో ఆదివారం కలిసి అభినందనలు తెలిపారు. చీపురుపల్లి ఎన్‌టిఆర్ ఫ్యాన్స్ సభ్యులు, నియోజకవర్గము ఐటిడిపి అధ్యక్షులు నాగులపల్లి నారాయణ రావు ఆయన్ను మర్యాద పూర్వాకంగా కలిసారు. నియోజకవర్గ స్థాయిలో ఫ్యాన్స్ తరుపున ఆయనకు అభినందనలు తెలిపారు. మరిన్ని మంచి సినిమాలు తీయాలని ఆకాంక్షించారు. ఆయన వెంటన టిడిపి నాయకులు ఉన్నారు.


కల్యాణ్‌రామ్‌తో టిడిపి నాయకులు

శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా పండగ

బొబ్బిలి రూరల్ : శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా గ్రామ దేవత పండుగ నిర్వహించాలని ఎం.బూర్జవలస గ్రామ దేవత ఉత్సవ కమిటీను పట్టణ సిఐ ఎం.నాగేశ్వరరావు కోరారు. ఎం.బూర్జవలసలో ఆదివారం సాయంత్రం ఉత్సవ కమిటీతో ఆయన సమావేశం నిర్వహించారు. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా పండుగ నిర్వహించాలన్నారు. డిజెలు, అశ్లీలత నృత్యాలు పెడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయనతో ఎస్‌ఐ జ్ఞానప్రసాద్, పోలీసు సిబ్బంది ఉన్నారు.


ఉత్సవ కమిటీతో మాట్లాడుతున్న సిఐ